క్లుప్తంగా

సీజ్ చేసిన వాహనాల వేలం

హుజూర్‌నగర్ : హుజూర్‌నగర్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో వివిధ కేసుల్లో సీజ్ చేసిన వాహనాల వేలం పాట బుధవారం స్థానిక ఎక్సైజ్ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఎక్సైజ్ అధికారి ఆర్ లక్ష్మానాయక్ మాట్లాడుతూ.. పట్టుబడిన 22 వాహనాలకు ప్రభుత్వం నిర్ణయించిన ధర 1.71 లక్షలతో వేలం నిర్వహించినట్లు తెలిపారు. ఈ వేలంలో జీఎస్టీతో కలుపుకుని రూ.2,75,530 ఆదాయం వచ్చినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఎక్సైజ్ సీఐ నాగార్జునరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య



ప్రీ ప్రైమరీ సెక్షన్‌ను ప్రారంభిస్తున్న ఎంఈఓ గోపాల్‌రావు

మోతె : ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్య అందుతోందని మండల విద్యాధికారి కె.గోపాల్‌రావు అన్నారు. బుధవారం మండలంలోని రావిపహాడ్‌లో గల ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ప్రీ ప్రైమరీ సెక్షన్‌ను ఆయన ప్రారంభించి, పిల్లలకు అక్షరాభ్యాసం చేయించి మాట్లాడారు. పాఠశాలలో ప్రీ ప్రైమరీలో 9 అడ్మిషన్లు చేసిన ఉపాధ్యాయులను అభినందించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నాయకపు పరమేష్, హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు అమృతారెడ్డి, ఉపాధ్యాయులు పాపిరెడ్డి, నర్సింహారెడ్డి, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

డొంక ఆక్రమణ.. 'మైహోం'పై విచారణకు ఆదేశం

మేళ్లచెరువు : మండల కేంద్రంలో పొలాలకు వెళ్లే డొంక దారి ఆక్రమణపై రైతుల తరఫున న్యాయవాది కమతం నాగార్జున కోర్టులో కేసు వేయగా బుధవారం జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్‌పవార్.. ఆర్డీఓ, తహసీల్దార్‌ను విచారణకు ఆదేశించినట్లు నాగార్జున తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సర్వే నంబర్ 1100లో రైతులు భూములు ఉన్నాయని, ఆ భూములకు వెళ్లేందుకు మైహోం పరిశ్రమ మధ్యలో నుంచి డొంక దారి ఉన్నట్లు పేర్కొన్నారు. 2012 సంవత్సరంలో రైల్వే లైన్ నిర్మాణ సమయంలో ఈ దారికి అండర్‌పాస్ బ్రిడ్జి, ఫ్లైఓవర్ బ్రిడ్జి వంటివి నిర్మించకపోవడంతో డొంక దారి ఉపయోగంలో లేకుండా పోయిందని, ఇదే అదునుగా భావించిన సదరు పరిశ్రమ వారు డొంకను ఆక్రమించినట్లు ఫిర్యాదులో పేర్కొన్నట్లు తెలిపారు. రైతులు తమ పొలాలకు వెళ్లేందుకు దారి లేక ఇబ్బందులు పడుతున్నారని, డొంక దారికి ప్రత్యామ్నాయంగా పరిశ్రమ వారు మరో దారిని ఏర్పాటు చేయాలని, కబ్జా చేసిన భూమికి నష్టపరిహారంగా గ్రామపంచాయతీకి 25 ఎకరాల భూమిని అప్పగించాలని కోరినట్లు తెలిపారు.

బస్సు సర్వీస్‌ను పునరుద్ధరించాలని వినతి

పాలకవీడు : మిర్యాలగూడ డిపో నుంచి పాలకవీడు మండలంలోని డెక్కన్ సిమెంట్ పరిశ్రమ వరకు నడిచే పల్లె వెలుగు బస్సు సర్వీస్‌ను పునరుద్ధరించాలని జాన్‌పహాడ్ గ్రామస్తులు కోరారు. ఈమేరకు బుధవారం మిర్యాలగూడ ఆర్టీసీ డిపో మేనేజర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత 20 రోజులుగా ఈ ప్రాంతానికి ఆర్టీసీ బస్సు సేవలను నిలిపివేయడంతో ప్రజలు, విద్యార్థులు, కార్మికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు తెలిపారు.

పారిశుద్ధ్యం మెరుగుపై దృష్టి సారించాలి

చిలుకూరు : గ్రామాల్లో పారిశుద్ధ్యం మెరుగుపై పంచాయతీ కార్యదర్శులు వందశాతం దృష్టి సారించాలని ఎంపీడీఓ గిరిబాబు అన్నారు. బుధవారం చిలుకూరు మండల పరిషత్ కార్యాలయంలో గ్రామాల అభివృద్ధి, ఎన్‌ఆర్ ఈజీఎస్‌పై గ్రామ పంచాయతీ కార్యదర్శులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యదర్శులు ప్రతి రోజు వార్డుల్లో తిరిగి సమస్యలను పరిష్కరించాలని సూచించారు. వనమహోత్సవంలో భాగంగా మొక్కలు నాటాలని అన్నారు. ఎంపీఓ ముక్కపాటి నరసింహారావు, ఏపీఓ నిర్మల, ఈసీలు, టీఏలు, గ్రామ కార్యదర్శులు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా విద్యుత్ స్తంభాలు



పొలంలో ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ స్తంభం

నడిగూడెం : మండలంలోని ఎఖ్లాస్‌ఖాన్ పేట గ్రామంలో విద్యుత్ స్తంభాలు ప్రమాదకరంగా ఉన్నాయి. గ్రామంలోని పలువురు రైతుల వ్యవసాయ బావులు, బోర్ల వద్ద ఏర్పాటు చేసుకున్న స్తంభాలు పాత కాలం నాటివి కావడంతో శిథిలావస్థకు చేరాయి. దీంతో ఎప్పుడు ఎలాంటి ప్రమాదం జరుగుతుందోనని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు స్పందించి కొత్త విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేయాలని రైతులు కోరుతున్నారు.

రోడ్డు గుల్ల.. రాకపోకలు ఎలా



అధ్వానంగా మారిన రామాపురం రోడ్డు

చిలుకూరు : మండల కేంద్రంలోని ఎస్ఎస్‌పీ 9– ఆర్ కాలువ వద్ద గల ఆంజనేయస్వామి దేవాలయం వద్ద నుంచి రామాపురం వెళ్లే బీటీ రోడ్డు గుల్లయింది. ఓ లారీ ట్రాన్స్‌పోర్ట్ కంపెనీ వారి లారీలు డీజిల్ కోసం ఏర్పాటు చేసుకున్న బంకుకు నిత్యం భారీ వాహనాల రాకపోకలతో రోడ్డు అధ్వానంగా తయారైంది. గుంతలమయంగా మారింది. దీంతో రాకపోకలకు ద్విచక్ర వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ రోడ్డుకు ఇరుపక్కల చిలుకూరు, రామాపురం గ్రామాలకు చెందిన రైతుల భూములు ఉన్నాయి. అంతేకాక ఈ రోడ్డు నుంచి తక్కువ దూరంలో విజయవాడ– హైదరాబాద్ జాతీయ రహదారిని చేరవచ్చు. కానీ రోడ్డు అధ్వానంగా తయారుకావడంతో రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు. ఈవిషయమై రైతులు అధికారులకు విన్నవించినా ప్రయోజనం లేకుండా పోయింది. సంబంధిత అధికారులు స్పందించి రోడ్డు బీటీని తొలగించి మెటల్ వేసి బీటీ రోడ్డు వేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ప్రయాణం.. నరకప్రాయం



గుంతలమయంగా మొద్దుల చెరువు - రామసముద్రం మధ్య రోడ్డు

మునగాల : మండలంలోని జాతీయ రహదారిపై గల మొద్దుల చెరువు స్టేజీ నుంచి విజయరాఘవపురం(రామసముద్రం) వరకు గల ఆర్అండ్‌బీ రోడ్డు అధ్వానంగా ఉంది. ఈ రహదారిని డబుల్ రోడ్డుగా మార్చేందుకు గాను ప్రభుత్వం నుంచి నిధులు మంజూరయ్యాయి. పనులు కూడా ప్రారంభమయ్యాయి. కానీ నత్తనడకన జరుగుతుండడంతో ప్రజలు అవస్థలు పడుతున్నారు. ప్రస్తుత వర్షాలకు రోడ్డు చిత్తడిగా మారి కనీసం ద్విచక్ర వాహనాలు, ఆటోలు ప్రయాణించే పరిస్థితి లేదు. రహదారిపై మోకాళ్ల లోతు గుంతలు ఏర్పడడంతో వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. ఈ రహదారి నుంచి మండలంలోని రేపాల, నరసింహులగూడెం, మోతె మండల కేంద్రానికి నిత్యం వందలాది మంది ప్రజలు రాకపోకలు సాగిస్తుంటారు. ఇప్పటికైనా సదరు కాంట్రాక్టర్ స్పందించి డబుల్‌రోడ్డు నిర్మాణ పనులను ముమ్మరం చేయాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

ప్రభుత్వం రైతులకు యూరియా అందించాలి



సూపరింటెండెంట్‌కు వినతిపత్రం అందిస్తున్న ఏఐకేఎస్ నాయకులు

హుజూర్‌నగర్ : రైతులకు సరిపడా యూరియా అందించాలని ఆల్ ఇండియా కిసాన్ సభ (ఏఐకేఎస్) జాతీయ కౌన్సిల్ సభ్యుడు కొప్పోజు సూర్యనారాయణ, రాష్ట్ర నాయకుడు పల్లె వెంకట్ రెడ్డి అన్నారు. ఈమేరకు బుధవారం హుజూర్‌నగర్‌లో తహసీల్దార్ కార్యాలయం ఎదుట సంయుక్త కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించి సూపరింటెండెంట్ మట్టయ్యకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సాగర్ ఆయకట్టు కింద వరి నాట్లు వేసి నెలరోజులైనా యూరియా వేయకపోవడంతో పైర్లు పిలకలు పెట్టక వరిపైరు పెరగడం లేదని అన్నారు. గత యాసంగిలో ప్రభుత్వం కొన్న ధాన్యానికి కొందరు రైతులకు ఐకేపీ బోనస్ నేటికీ అందలేని, వెంటనే జమ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు జడ శ్రీనివాస్, యల్లావుల రమేష్, జక్కుల రమేష్, మామిడి నరసయ్య, దుగ్గి బ్రహ్మం, పి.వెంకటరెడ్డి, పి.వీరబాబు, వాసుదేవరావు, సుధాకర్, వీరమల్లు, వీరస్వామి, యోన, రమణ, మామిడి వెంకయ్య, మల్లయ్య, వెంకన్న, వెంకటి, నాగేశ్వరరావు, శ్రీను, సాంబయ్య, తదితరులు పాల్గొన్నారు.

యూరియా కొరత లేకుండా చూడాలి

మునగాల : రాష్ట్రంలో యూరియా కొరతతో రైతులు ఇబ్బందులు పడుతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ప్రజాతంత్ర యువజన సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు కోట రమేష్ ఆరోపించారు. బుధవారం మండలంలోని తాడువాయి సొసైటీ ఆవరణలో రైతులనుద్దేశించి ఆయన మాట్లాడారు. యూరియా కోసం రైతులు రోజుల తరబడి సొసైటీ కార్యాలయాల ముందు నిలబడి తీవ్ర ఇక్కట్లను ఎదుర్కొంటున్నారన్నారు. తాడువాయి సొసైటీ పరిధిలో 13 గ్రామాల రైతులు యూరియా కోసం సొసైటీ వద్ద పడిగాపులు కాస్తుంటే అడపాదడపా రెండు వందల బస్తాలు పంపిణీ చేయడం విడ్డూరంగా ఉందని ఎద్దేవా చేశారు. వరిపంటలకు సకాలంలో యూరియా వేయకపోతే దిగుబడి తగ్గి నష్టాలు చవిచూసే పరిస్థితి ఏర్పడనున్నదన్నారు. ప్రభుత్వం స్పందించి యూరియా కొరత లేకుండా చూడాలని కోరారు. తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం నాయకులు షేక్ సైదా, రైతులు మాతంగి పుల్లయ్య, పాపారావు, శివరామకృష్ణ, వెంకన్న, బాలకృష్ణ, రైతులు పాల్గొన్నారు.

బురదమయమైన వీధిలో వరినాట్లు వేసి నిరసన



మునగాల : 12వ వార్డులో వరినాట్లు వేసి నిరసన తెలుపుతున్న స్థానికులు

మునగాల : సీపీఎం ఇంటింటి సర్వేలో భాగంగా మునగాల మండల కేంద్రంలోని 12వ వార్డును పార్టీ నాయకులు సందర్శించారు. బురదమయమైన వీధుల్లో స్థానికులతో కలిసి వరినాట్లు వేసి నిరసన తెలిపారు. వీధుల పరిస్థితిని పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపించారు. కార్యక్రమంలో సీపీఎం గ్రామశాఖ కార్యదర్శి కిన్నెర వెంకన్న, డీవైఎఫ్ఐ మండల కార్యదర్శి గడ్డం వినోద్, గ్రామ కార్యదర్శి దేవరం శ్యాంసుందర్‌రెడ్డి, పార్టీ కార్యకర్తలు గడ్డం వెంకన్న, గడ్డం వినోద్, ఇటికాల వెంకులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలపై సీపీఎం పోరుబాట

మేళ్లచెరువు : మండలంలోని యర్రగట్టు తండాలో ప్రజా సమస్యలపై సీపీఎం ఆధ్వర్యంలో బుధవారం పోరుబాట నిర్వహించారు. సీపీఎం నాయకుడు సైదులు మాట్లాడుతూ అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వాలని కోరారు. టి.స్వామి, గుండు సైదులు, సైదా, రవి, బోడి, శిరీష, ప్రమీల, శారద, పాల్గొన్నారు.

మొక్కలు నాటడం అందరి బాధ్యత



నేరేడుచర్ల : పాఠశాలలో మొక్క నాటుతున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు, సీజీఆర్ ప్రతినిధులు



పాలకవీడు : మొక్కలు నాటుతున్న డెక్కన్ సిమెంట్స్ యాజమాన్యం

పాలకవీడు : మొక్కలు నాటడం అందరి బాధ్యత అని డెక్కన్ సిమెంట్ పరిశ్రమ వైస్ ప్రెసిడెంట్ ఎస్.శ్రీనివాసరాజు అన్నారు. వన మహోత్సవంలో భాగంగా బుధవారం మండల పరిధిలోని పరిశ్రమ భూముల్లో యాజమాన్యం, సిబ్బంది, కార్మికులతో కలిసి ఆయన మొక్కలు నాటించారు. కార్యక్రమంలో జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్ టీ.సీతారాం, సీజీఎం నాగమల్లేశ్వరరావు, వివిధ విభాగాల ప్రతినిధులు, కార్మికులు, పాల్గొన్నారు.

ప్రతిఒక్కరూ మొక్కలు నాటాలి

నేరేడుచర్ల : పట్టణంలోని పీఎం శ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏక్ పెడ్ మా కే నామ్ (అమ్మ పేరిట ఒక చెట్టు) క్యాంపెయిన్‌లో భాగంగా సీజీఆర్ సూర్యాపేట సహకారంతో పాఠశాల ప్రధానోపాధ్యాయులు బట్టు మధు.. దాత మాజీ సర్పంచ్ కొణతం సత్యనారాయణరెడ్డి, విద్యార్థుల తల్లిదండ్రులతో కలిసి మొక్కలు నాటారు.కార్యక్రమంలో సీజీఆర్ ప్రతినిధులు కత్తి కోటయ్య, ఉపాధ్యాయులు సైదులు, రహీద్, జానకిరాములు, శౌరీ, వెంకటేశ్వర్‌రావు, అన్నపూర్ణ, నర్సింహారావు, మాధవి, ఆఫ్రస్, వెంకట్ రెడ్డి, భానుమతి, బి.కోజి, బాలు, యాదగిరి, శ్రీనివాస్‌రెడ్డి, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

పత్తి దిగుమతిపై సుంకం రద్దుతో రైతులకు నష్టం



చిలుకూరు : తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందజేస్తున్న నాయకులు, రైతులు

చిలుకూరు : పత్తి దిగుమతిపై 11 శాతం సుంకాన్ని కేంద్ర ప్రభుత్వం రద్దు చేయడాన్ని ఖండిస్తూ బుధవారం చిలుకూరు తహసీల్దార్ కార్యాలయం ఎదుట సంయుక్త కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర రైతు జిల్లా అధ్యక్షుడు దొడ్డా వెంకటయ్య మాట్లాడుతూ.. పత్తిపై సుంకాన్ని రద్దు చేయడంతో మన దేశంలో పత్తి పండించే రైతులు తీవ్రంగా నష్టపోతారని ఆవేదన వ్యక్తం చేశారు. పత్తికి క్వింటాకు మద్దతు ధర రూ.10,075 పెంచాలని డిమాండ్ చేశారు. అప్పుల బాధతో ఆత్మహత్య చేసుకున్న రైతుల కుటుంబాలకు రూ. 25 లక్షలు ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని తహసీల్దార్ ధృవకుమార్‌కు అందజేశారు. కార్యక్రమంలో రైతులు యరగాని నాగయ్య, కొండా శేషయ్య, కొండా పెద వెంకయ్య, గంగిరెడ్డి రవీందర్‌రెడ్డి, దొడ్డా రాంబాబు, జానీ, సక్రు తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న గణేష్ నవరాత్రోత్సవాలు



హుజూర్‌నగర్ : పూజలో పాల్గొన్న నాయకులు, భక్తులు



నేరేడుచర్ల : ఎస్‌ఆర్‌కే రెసిడెన్సీలో అన్నదానం ప్రారంభిస్తున్న ఎస్ఐ రవీందర్‌నాయక్



కోదాడరూరల్ : కోదాడలో అన్నదానం ప్రారంభిస్తున్న తహసీల్దార్ వాజిద్ అలీ

పెండింగ్ వేతనాలు విడుదల చేయాలని వినతి



గరిడేపల్లి : ఎంపీడీఓకు వినతిపత్రం అందజేస్తున్న పంచాయతీ కార్మికులు



మునగాలలో ఎంపీడీఓకు వినతిపత్రం అందజేస్తున్న జీపీ వర్కర్స్ యూనియన్ నాయకులు

మునగాల : గ్రామ పంచాయతీ సిబ్బంది పెండింగ్ వేతనాలు విడుదల చేయాలని గ్రామపంచాయతీ ఎంప్లాయిస్, వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి సొంపంగు రాధాకృష్ణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈమేరకు బుధవారం మండల కేంద్రంలో ఎంపీడీఓ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి ఎంపీడీఓకు వినతిపత్రం అందజేశారు. అనంతరం రాధాకృష్ణ మాట్లాడుతూ.. జీఓ నంబర్ 51ను సవరించాలని, మల్టీపర్పస్ వర్కర్స్ విధానాన్ని రద్దు చేయాలని కోరారు. గ్రీన్‌ఛానల్ ద్వారా వేతనాలు చెల్లించాలన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యుడు బచ్చలకూరి స్వరాజ్యం, గ్రామిక మహిళా జిల్లా కన్వీనర్ బండారు గురవమ్మ, యూనియన్ మండల అధ్యక్ష, కార్యదర్శులు ఎల్.నాగార్జున, మామిడి వెంకన్న, కమిటీ సభ్యులు ఏ.వెంకటేశ్వర్లు, పి.నరసయ్య, ఎస్.రఘు, ఎం.ముత్తయ్య, సాగర్, ఎస్.నాగరాజు, మరియమ్మ, విమల, కుమారి, రవి పాల్గొన్నారు.

నడిగూడెంలో..

నడిగూడెం : గ్రామ పంచాయతీల్లో పనిచేస్తున్న మల్టీ పర్పస్ వర్కర్ల పెండింగ్ వేతనాలు విడుదల చేయాలని కోరుతూ బుధవారం సీఐటీయూ ఆధ్వర్యంలో నడిగూడెం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ మల్సూర్‌నాయక్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సీఐటీయూ మండల కన్వీనర్ మల్లెల వెంకన్న, సీపీఎం మండల కార్యదర్శి బెల్లంకొండ సత్యనారాయణ, గ్రామ పంచాయతీ మల్టీ పర్పస్ వర్కర్ల సంఘం మండల అధ్యక్షుడు షేక్.సుభాని, ఉపాధ్యక్షుడు చిమట నాగరాజు, నాగభూషణం, గుర్వయ్య, రామకృష్ణ, వెంకన్న, పెద యేసు, వెంకటమ్మ, ఉపేంద్ర, వీరస్వామి పాల్గొన్నారు.

మఠంపల్లిలో..

మఠంపల్లి : ప్రభుత్వం జీఓ నంబర్ 51ను సవరించి, గ్రీన్ చానల్ ద్వారా గ్రామ పంచాయతీ కార్మికులకు ప్రతి నెల వేతనాలు చెల్లించాలని పంచాయతీ వర్కర్స్ యూనియన్ నాయకులు కోరారు. మేరకు బుధవారం మఠంపల్లి మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ వెంకటాచారికి వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యుడు సయ్యద్‌రన్‌మియా, పంచాయతీ వర్కర్స్ యూనియన్ మండల నాయకులు మైసయ్య, వీరస్వామి, నాగయ్య, ప్రకాశ్‌రెడ్డి, వినోద్ పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని కార్మికుల ధర్నా

గరిడేపల్లి : తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ గ్రామ పంచాయతీ కార్మికులు గరిడేపల్లి మండల పరిషత్ కార్యాలయం ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో బుధవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ పంచాయతీ కార్మికుల సంఘం మండల అధ్యక్షుడు కొండా సైదులు మాట్లాడుతూ.. కార్మికులకు కనీస వేతనం రూ. 26వేలు ఇవ్వాలని కోరారు. ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలని అన్నారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని ఎంపీడీఓ సునితకు అందజేశారు. కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు కష్టపడి చదవాలి



ఇంటర్‌లో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులతో డీఎస్పీ శ్రీధర్‌రెడ్డి

కోదాడ : విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని కోదాడ డీఎస్పీ మామిళ్ల శ్రీధర్‌రెడ్డి అన్నారు. బుధవారం కోదాడ పట్టణంలోని శ్రీరస్తు ఫంక్షన్ హాల్‌లో జరిగిన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్‌లో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు అమృత రామానుజరావు ట్రస్టు (ఏఆర్‌టీ) ఆధ్వర్యంలో ప్రతి సంవత్సరం అందించే గోల్డ్ మెడల్‌తో పాటు, ప్రశంసాపత్రాన్ని బుధవారం డీఎస్పీ చేతుల మీదుగా అందజేశారు. పదవ తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులను అభినందించారు. కార్యక్రమానికి ట్రస్ట్ చైర్మన్ శేషప్రసాద్ అధ్యక్షత వహించగా ట్రస్టు సభ్యులు యశ్వంత్, శ్రీధర్‌రావు, మాధవిలత, కేఆర్‌ఆర్ కళాశాల అధ్యాపకులు వేముల వెంకటేశ్వర్లు, రిటైర్డు అధ్యాపకులు శ్రీరామకవచం వెంకటేశ్వర్లు, ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.

చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు

హుజూర్‌నగర్ : చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు తప్పవని సీఐ చరమందరాజు హెచ్చరించారు. బుధవారం హుజూర్‌నగర్ మున్సిపాలిటీ పరిధిలోని మాధవరాయనిగూడెంలో నిర్వహించిన పోలీస్ ప్రజా భరోసా కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. వినాయకుల శోభాయాత్ర, నిమజ్జనంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తుగా గట్టి బందోబస్తు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రతి ఒక్కరూ తమ ఇంటి ఆవరణలో, గ్రామాలలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

అనుమానాస్పద వ్యక్తులు కనబడితే సమాచారం ఇవ్వాలి

హుజూర్‌నగర్ : పట్టణం, మండలంలో అనుమానాస్పద వ్యక్తులు కనబడితే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సీఐ చరమందరాజు, ఎస్ఐ మోహన్‌బాబు బుధవారం ఒక ప్రకటనలో కోరారు. దొంగలు తాళాలు వేసిన ఇళ్లను టార్గెట్ చేస్తూ హుజూర్‌నగర్ పట్టణం, మండలంలో తిరుగుతున్నారని, మీ ప్రాంతంలో కొత్త వ్యక్తులు అనుమానాస్పదంగా కనిపిస్తే డయల్ 100 ఫోన్ చేసి వివరాలు తెలియజేయాలని కోరారు. ఎవరైన యజమానులు వేరే ఊరు వెళ్లాల్సి వస్తే తప్పకుండా పోలీసులకు తెలియపరచాలని కోరారు. అత్యవసర పరిస్థితుల్లో వెళ్లే ఆభరణాలు, నగదు బ్యాంకుల్లో భద్రపర్చుకోవాలని తెలిపారు. ఇంటి వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని, అవి ఇంటికి కాపలాగా ఉంటాయని పేర్కొన్నారు.

బీసీ బిల్లు ఆమోదం చరిత్రాత్మకం

హుజూర్‌నగర్ : రాష్ట్రంలో బీసీలకు స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతం రిజర్వేషన్ కల్పించాలని తీసుకొచ్చిన బిల్లు అసెంబ్లీలో ఆమోదం పొందడం చరిత్రాత్మకమని కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు తన్నీరు మల్లికార్జున్, నాయకులు అజీజ్ పాషా, దొంగరి వెంకటేశ్వర్లు, దొంతగాని శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. బుధవారం హుజూర్‌నగర్‌లోని ఇందిరా భవన్‌లో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. బిల్లును గవర్నర్, రాష్ట్రపతి వెంటనే ఆమోదించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు జె.మల్లయ్య, ఎస్.సుబ్బరాజు, జి.వెంకటేశ్వర్లు, పి.రామరాజు, మన్సూర్ అలీ, ఎం.సత్యనారాయణ, బి.గోవిందరావు, వెంకటనారాయణ, ఉపేందర్, రామ్మూర్తి, ఎం.సైదులు, కె.పుల్లయ్య, కె.సైదులు, అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆదర్శప్రాయుడు.. గోవిందునాయక్

● ఎమ్మెల్సీ శంకర్ నాయక్

హుజూర్‌నగర్ : ప్రభుత్వ పాఠశాలల్లో చదివిన పేద పిల్లలను తీర్చిదిద్ది గొప్ప వారిని చేసిన మహనీయుడు గోవిందునాయక్ అని ఎమ్మెల్సీ శంకర్ నాయక్, ఎస్టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సదానందగౌడ్ అన్నారు. గరిడేపల్లి మండలం తాళ్ల మల్కాపురం హెచ్‌ఎం గోవిందనాయక్ సంతాప సభను బుధవారం హుజూర్‌నగర్‌లో ఎస్టీయూ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు పాల్గొని మాట్లాడారు. మారుమూల తండాలోని పేద కుటుంబంలో జన్మించిన గోవిందునాయక్ ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎదిగి ఆదర్శప్రాయుడిగా నిలిచారని వారు కొనియాడారు. అనంతరం గణిత ఉపాధ్యాయుల ఫోరం జిల్లా ప్రతినిధులు వెంకటేష్, ఉపేందర్ తదితరులు గోవింద నాయక్ కుటుంబానికి రూ.63 వేల ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో ఎస్టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కేవీ సత్యనారాయణ, జిల్లా అధ్యక్షుడు వి. నాగేశ్వరరావు, గిరిజన ఉపాధ్యాయ సంఘం నాయకుడు డి.మోతీలాల్, ఎంఈఓలు చత్రునాయక్, సైదానాయక్, సీహెచ్‌ఎంలు సువర్ణ, నాగమణి, వివిధ ఉపాధ్యాయ సంఘాల నాయకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పాఠశాలల్లో ఎస్‌జీఎఫ్ క్రీడలు



కోదాడ : విజేతలకు బహుమతులు అందజేస్తున్న వంగవేటి రామారావు



మునగాల : కలకోవలో క్రీడలను ప్రారంభిస్తున్న ఎంపీడీఓ, ఎంఈఓ



మేళ్లచెరువు : విజేతలకు బహుమతులు అందిస్తున్న ఎంఈఓ వెంకటరెడ్డి

మేళ్లచెరువు : మండలంలోని రామాపురంలో గల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బాలబాలికలకు నిర్వహిస్తున్న మండల స్థాయి వాలీబాల్ క్రీడా పోటీలు బుధవారం ముగిసాయి. ఈ సందర్భంగా విజేతలకు ఎంఈఓ వెంకటరెడ్డి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు రాములునాయక్, ఫాతిమా, పీఈటీలు ఉపేందర్ రావు, రంగారావు, రాజ్యలక్ష్మి, బసవయ్య, విద్యార్థులు పాల్గొన్నారు.

విజేతలకు బహుమతుల ప్రదానం

కోదాడ : కోదాడ బాలుర పాఠశాలలో మూడు రోజులుగా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఆటల పోటీలు బుధవారం రాత్రి ముగిసాయి. పోటీల విజేతలకు జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ వంగవేటి రామారావు, చింతకుంట్ల లక్ష్మీనారాయణరెడ్డి బహుమతులు అందజేశారు.

మండల స్థాయి ఎస్‌జీఎఫ్ క్రీడలు ప్రారంభం

మునగాల : మండలంలోని కలకోవలో గల జెడ్పీ ఉన్నత పాఠశాలలో బుధవారం మండల స్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్(ఎస్‌జీఎఫ్) క్రీడా పోటీలను ఎంపీడీఓ కె.రమేష్‌దీనదయాళ్, మండల విద్యాధికారి పిడతల వెంకటేశ్వర్లు ప్రారంభించారు. కార్యక్రమంలో ఎస్‌జీఎఫ్ మాజీ కార్యదర్శి ఆజాం బాబా, క్రీడల నిర్వాహకులు పప్పుల వీరబాబు, హెచ్‌ఎం తేజరామ్, ఏఏపీసీ చైర్మన్ పనస లక్ష్మి, మాజీ సర్పంచ్‌లు చిర్రా శ్రీనివాస్, గ్రామపెద్దలు మండవ వెంకటాద్రి, మండవ వీరబాబు, మండవ చంద్రయ్య, గెజిటెట్ హెచ్‌ఎంలు మైనం శోభన్ బాబు, కొల్లు శ్రీనివాస్, పందిరి నర్సిరెడ్డి, పీడీలు కళ్యాణి, కవిత, గోవిందరెడ్డి, పాషా, నాగేశ్వరరావు, గుర్వయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

మాజీ ఎమ్మెల్యే మల్లయ్యయాదవ్ పరామర్శ

నడిగూడెం : మండల కేంద్రానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకుడు గుండు పెద్ద లింగరాజు (38) ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. బుధవారం కోదాడ మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య మృతుడి కుటుంబాన్ని పరామర్శించారు. పెద్ద లింగరాజు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. బీఆర్‌ఎస్ సమన్వయకర్త అనంతుల ఆంజనేయులు, ఎస్‌కె.జలీల్, మేకల గంగరాజు, దున్నా ప్రవీణ్, మేకల వీరబాబు, గౌస్‌మియా, సతీష్, సైదులు, ఉదయ భాస్కర్, వెంకటేష్ ఉన్నారు.

శోభాయాత్రలో డీజేలకు అనుమతి లేదు

గరిడేపల్లి : గణేష్ శోభాయాత్రలో డీజేలకు అనుమతి లేదని ఎస్ఐ చలికంటి నరేష్ తెలిపారు. బుధవారం గరిడేపల్లిలో ఆయన మాట్లాడుతూ.. డీజేలు పెడితే కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మండలంలో ఇటీవల దొంగతనాలు జరుగుతున్నాయని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోరారు. అపరిచిత వ్యక్తులు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు.

ఎస్టీ జాబితా నుంచి తొలగించాలనడం సరికాదు

మఠంపల్లి : లంబాడీలను ఎస్టీ జాబితా నుంచి తొలగించాలనడం సరికాదని, అది రాజ్యాంగ విరుద్ధమని బీజేపీ గిరిజన మోర్చా జిల్లా నాయకుడు బానోతు రంగానాయక్ అన్నారు. బుధవారం ఆయన మఠంపల్లిలో విలేకరులతో మాట్లాడారు. లంబాడీలను ఎస్టీ జాబితా నుంచి తొలగించాలనే కొందరి కాంగ్రెస్ పార్టీ ప్రజాప్రతినిధుల వైఖరిపై కాంగ్రెస్ పార్టీ స్పష్టమైన విధానం వెల్లడించాలని ఆయన డిమాండ్ చేశారు. నాయకులు కోటి, అంజి, సైదులు, బాలు, బద్రు, తదితరులు ఉన్నారు.

స్టడీ మెటీరియల్ పంపిణీ

నేరేడుచర్ల : పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు ఇంచార్జి ప్రిన్సిపాల్ వెంకటరమణ ఎంసెట్, నీట్, జేఈఈకి సంబంధించిన స్టడీ మెటీరియల్‌ను బుధవారం ఉచితంగా అందజేశారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు డాక్టర్ మద్దిమడుగు సైదులు, ప్రణతి, కేవీఎల్ నర్సింహారావు, నరేందర్, అంజయ్య, నర్సింహచారి, వెన్నెల, వీరేష్, వెంకన్న, సుశాంత్ ఉన్నారు.

అనసూర్యమ్మ మృతి బాధాకరం

మునగాల : మండలంలోని తాడువాయిలో సీపీఎం సీనియర్ నాయకురాలు కోట అనసూర్యమ్మ మృతి బాధాకరమని కాంగ్రెస్ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి జిల్లేపల్లి వెంకటేశ్వర్లు అన్నారు. ఇటీవల అనారోగ్యంతో మృతిచెందిన అనసూర్యమ్మ దశదిన కర్మ బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా అనసూర్యమ్మ చిత్రపటం వద్ద ఆయన నివాళులర్పించారు. కాంగ్రెస్ పార్టీకి చెందిన మాజీ వైఎస్ ఎంపీపీ కొలిశెట్టి బుచ్చిపాపయ్య సహకారంతో మృతురాలి కుటుంబానికి 50 కేజీల బియ్యం అందజేసినట్లు వెంకటేశ్వర్లు తెలిపారు. యూత్ కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు సొంపంగు గోపి, వార్డు మాజీ సభ్యుడు జిల్లేపల్లి బాలకృష్ణ, యూత్ కాంగ్రెస్ నాయకులు జిల్లేపల్లి వినయ్, కోట దానియేలు, రాగిశెట్టి శ్రీను, శోభన్‌బాబు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో పలకలు పంపిణీ

మఠంపల్లి : మండలంలోని పెదవీడులో మూడు, చింతలమ్మగూడెంలో ఒక అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు మట్టపల్లి రెడ్డి నిత్యాన్నదాన సత్రం కమిటీ అధ్యక్షుడు సాముల వెంకటేశ్వరరెడ్డి తన తల్లి రామలక్ష్మమ్మ జ్ఞాపకార్థం పలకలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు, బాలలు తదితరులు పాల్గొన్నారు.